## క్లుప్తంగా

### పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు



**ఫిరంగిపురం:** మండలంలోని పలు గ్రామాలకు చెందిన 65 మంది అంగన్‌వాడీలు ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వీలుగా ఉత్తర్వులు వచ్చాయి. వారు విధులు నిర్వహించే ప్రాంతాల్లోనే తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులను తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఏఎస్‌వో శివకు అందజేశారు. వచ్చిన దరఖాస్తులను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పంపనున్నట్లు వారు తెలిపారు.

### వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంను చేసుకుందాం

**మంగళగిరి :** సంక్షేమ పథకాల రథసారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగర పరిధిలోని నూతక్కిలో ఆయన ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మంగళగిరి అభ్యర్థి మురుగుడు లావణ్య, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారు రోశయ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. స్థానిక నాయకులు అన్నపురెడ్డి విద్యాసాగర్ రెడ్డి, భీమిరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి, చీపూడి సురేష్, తమ్మా సుబ్బారెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ భీమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నూతక్కి, రామచంద్రరావు, మాజీ ఎంపీటీసీ సుభాని, గర్నెపూడి శివప్రసాద్, నూతక్కి శ్రీను పాల్గొన్నారు.

### విస్తృతంగా ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు



**తాడేపల్లిరూరల్:** మంగళగిరి తాడేపల్లి పాత జాతీయ రహదారి వెంబడి సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. స్క్వాడ్ ఇన్‌చార్జి అశోక్ మాట్లాడుతూ.. ఎటువంటి ఆధారాలు లేకుండా నగదు, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఏవైనా వస్తువులు తరలిస్తున్నారా అనే విషయాలను పరిశీలిస్తున్నామన్నారు. మొబైల్ వాహనం ద్వారా అన్ని ప్రాంతాల్లో తిరుగుతు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

### నేడు కాజలో లావణ్య ప్రచారం

**మంగళగిరి:** నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య మంగళవారం సాయంత్రం 4 గంటలకు నగర పరిధిలో కాజ, వెంకటరెడ్డి పాలెంలో ప్రచారం నిర్వహించనున్నట్లు సోమవారం ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రచారంలో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలలు పాల్గొంటారని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని పేర్కొంది.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**తాడేపల్లి రూరల్:** దుగ్గిరాల మండల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈఎస్ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ నూతన లైన్ పనుల మరమ్మతుల నిమిత్తం సబ్‌స్టేషన్ పరిధిలోని రేవేంద్రపాడు, శృంగారపురం, తుమ్మపూడి, పెదపాలెం, పెరికలపూడి, చినపాలెం, వీర్లపాలెం, పెదకొండూరు, గొడవర్రు గ్రామాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని పేర్కొన్నారు.

### ముగిసిన అంతర్జాతీయ నృత్య ప్రదర్శనలు



**నగరంపాలెం:** బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని అన్నమయ్య కళావేదికపై శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ నృత్య దినోత్సవ వేడుకలు సోమవారంతో ముగిశాయి. తొలుత నటరాజ పూజ, నృత్య నివేదనంగా 108 మంది శరణం భవకరుణామయ తరంగాన్ని సంప్రదాయ దుస్తులతో నర్తించారు. సాయంత్రం జరిగిన సభకు సి.హెచ్.మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేయగా, బూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. పలువురు కళాకారులు నృత్యప్రదర్శనలు అలరించాయి. కూచిపూడి సిద్ధేంద్ర కళాక్షేత్రం ప్రధానోపాధ్యాయులు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, ఆచార్య పసుమర్తి రామలింగేశ్వరశాస్త్రికి కూచిపూడి నాట్య విద్వాంసులు పసుమర్తి కృష్ణమూర్తి జీవిత సాఫల్య పురస్కారం అందించారు. అదేవిధంగా పలువురు కళాకారులకు యువ కళారత్న పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజా వెంకటసుబ్రహ్మణ్యం, కోశాధికారి వెంకటగిరి నాగలక్ష్మి, పెద్ది మాధవి, బత్తుల రాధిక పాల్గొన్నారు.

# ఉండవల్లి దాహార్తి తీర్చాం..

- రూ.3.5 కోట్ల వ్యయంతో నాలుగు శాండ్ ఫిల్టర్ బెడ్లు
- ప్రత్యేక శ్రద్ధతో డొంక రోడ్లు, బీటీ రోడ్డు అభివృద్ధి
- రాజధాని ప్రాంతంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య ప్రచారం
- భారీగా తరలివచ్చిన మహిళలు, యువత



బొట్టు పెట్టి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న లావణ్య, కాండ్రు కమల

**తాడేపల్లిరూరల్:** రాజధాని ముఖద్వారమైన ఉండవల్లిలో సోమవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఉండవల్లి అధ్యక్షులు దంటు గోవర్ధన్ రెడ్డి, బాలాజీరెడ్డి, తోక సత్యనారాయణ యాదవ్, బత్తుల దాసుయాదవ్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, మాజీ ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, ప్రముఖ న్యాయవాది నిర్మలత ప్రచారంలో పాల్గొన్నారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఉండవల్లిలో మహిళలు, యువకులు భారీగా ప్రచారంలో పాల్గొన్నారు. పార్టీ జెండాలు పట్టుకుని నృత్యాలు చేస్తూ బాణసంచా కాల్చారు. అడుగడుగునా మురుగుడు లావణ్యను ఆశీర్వదిస్తూ హారతులు పట్టారు. ఉండవల్లి సెంటరులో ప్రారంభమైన ర్యాలీ బలరామమూర్తి బజారు మీదుగా జామాయిల్ తోట, గుంటూరు చానల్, దేవాలయ భూములు, ఉండవల్లి బస్టాండ్, పైబజారు, రెడ్ల రామమందిరం, అమరారెడ్డి నగర్, హరిజనవాడ, ఉండవల్లి గుంటూరు చానల్ కరకట్ట, బాపనయ్య నగర్, సాయి నగర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా మురుగుడు లావణ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సారథ్యంలో ఉండవల్లిలో గత ప్రభుత్వం చేయలేని పనులు చేసి చూపించారన్నారు. కృష్ణానది పక్కనే ఈ ప్రాంతం ఉన్నా...ఆ నీరు తాగేందుకు గత ప్రభుత్వంలో నోచుకోలేదన్నారు. ఎమ్మెల్యే ఆర్కే చొరవ తీసుకుని ఉండవల్లిలో రెండు చోట్ల కృష్ణానదిలోని నీటిని ఉండవల్లి ప్రజలు వినియోగించుకునేందుకు గుంటూరు చానల్‌పై సుమారు రూ.3.5 కోట్ల వ్యయంతో నాలుగు శాండ్ ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేసి నిరంతరం స్వచ్ఛమైన మంచినీటిని అందిస్తున్నారని చెప్పారు. ఉండవల్లి హరిజనవాడ నుంచి పాత జాతీయ రహదారికి వచ్చే మార్గంలో రూ.68 లక్షల వ్యయంతో బీటీ రోడ్ నిర్మాణం చేపట్టారని, ఉండవల్లి గుంటూరు చానల్ ఎక్స్‌క్లూయిస్ నుంచి కొండవీటివాగు ఎత్తిపోతల వరకు కోటి రూపాయలతో బీటీ రోడ్ ఏర్పాటు చేసి, కాలవకట్ల వెంబడి వీధి లైట్లు ఏర్పాటు చేశామని వివరించారు. వర్షం వస్తే మునిగిపోయే జామాయిల్ తోటలో కోటి రూపాయల ఖర్చుతో సీసీ రోడ్లు నిర్మించారన్నారు. ఉండవల్లిలో డొంకరోడ్లను వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.10 కోట్లతో వేసినట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మాట ప్రకారం రాజధాని రైతు కూలీలకు పెన్షన్‌ను రూ.5వేలు ఇంటింటికి ఇస్తున్నట్లు చెప్పారు. ఫ్యాను గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారివెంకట రోశయ్యను, ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ పార్టీ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, మాజీ ఎంపీటీసీ మేకల హనుమంతరావు, ఉండవల్లి జేసీఎస్ కన్వీన్ అనిల్, మాజీ మండల ఉపాధ్యక్షుడు బురదగంట కనకవల్లి, రైతు సంఘం నాయకులు మున్నంగి సాంబిరెడ్డి, కళ్ళం సాంబిరెడ్డి, సుకుమార్, భాగ్యరాజు, నక్కా బాబు, అశోక్, శ్రావణ్, జోబిబాబు, హరీష్ యాదవ్, మంగళగిరి శివాలయం బోర్డు మెంబర్ కొల్లి ముసలారెడ్డి, రమేష్ రెడ్డి, నాగిరెడ్డి, బత్తుల ప్రభుదాస్ యాదవ్, బాదరబోయిన కొండలరావు యాదవ్, కూరపాటి రాజేష్ (కేబుల్ రాజేష్), శిగిరిశెట్టి రత్నబాబు, గుర్రాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మురుగుడు లావణ్యకు నూతన వస్త్రాల బహూకరణ

# ఆదర్శంగా చెంచుకాలనీ అభివృద్ధి

- అధికారంలోకి వచ్చాక రూ. కోటితో మౌలిక వసతుల కల్పన
- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేకతోటి సుచరిత





ఎన్నికల ప్రచారంలో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

**తాడికొండ:** తను అధికారంలోకి వచ్చిన వెంటనే తాడికొండ చెంచు కాలనీలో రూ.కోటి నిధులు వెచ్చించి మౌలిక వసతులు కల్పిస్తానని తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేకతోటి సుచరిత అన్నారు. సోమవారం తాడికొండ చెంచు కాలనీ, ముస్లిం కాలనీ, పంచాయతీ కార్యాలయం బజారులలో పర్యటించిన ఆమె ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చెంచు కాలనీకి చెందిన పలువురు రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని సమస్య తీర్చాలని కోరారు. స్పందించిన సుచరిత చెంచు కాలనీని రోల్ మోడల్‌గా అభివృద్ధి చేసి తీరుతానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధిని ప్రతి పేదవాడి ఇంటి గడపకు చేర్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారనేందుకు గ్రామాల్లో తమకు వస్తున్న ఆదరణే నిదర్శనమన్నారు. మంచి జరిగితేనే ఓటేయండని సీఎం జగన్ అడుగుతున్నారని, బాబు కానీ ఆయన కూటమి నాయకులు కానీ తాము పేదలకు ఇంత మేలు చేశాం ఓటేయండని అడిగే ధైర్యం ఉందేమో ఆలోచించుకొని ఓట్లు అడిగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాడికొండ సర్పంచ్ తోకల సరోజినీ, సొసైటీ చైర్మన్ షేక్ నగీనా, తుళ్ళూరు మండల ముఖ్య నాయకులు కొప్పుల శేషగిరిరావు, స్థానిక ఎంపీటీసీ షేక్ హబీబా, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, నిడుముక్కల సర్పంచ్ మాదాసు రత్నకుమారి, ఉప సర్పంచ్ వెంకటరెడ్డి, వివిధ విభాగాల నాయకులు బెజ్జం సాయి ప్రసాద్, వంగా పోలారెడ్డి, రాఘవరెడ్డి, తిరుపతిరెడ్డి, ఉండవల్లి నరసింహారావు పలువురు ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సుచరితకు మద్దతు తెలిపిన మాదిగ మహాసేన



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రేమ్‌కుమార్

**మేడికొండూరు:** తాడికొండ నియోజకవర్గంలో మాదిగల మద్దతు మేకతోటి సుచరితకే ఉంటుందని మాదిగ మహా సేన వ్యవస్థాపకుడు కూరపాటి ప్రేమ్‌కుమార్ స్పష్టం చేశారు. నియోజకవర్గంలో మాదిగ మహాసేన వైఎస్సార్ సీపీకి మద్దతుగా సోమవారం పేరేచర్ల గ్రామంలో ప్రచారం నిర్వహించారు. స్థానికులు మాదిగ మహా సేనకు సంఘీభావం తెలిపారు. మాదిగలంతా వైఎస్సార్ సీపీకే ఓటు వేయాలంటూ కరపత్రాలు పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాదిగలకు అందించిన సంక్షేమ పథకాలు వివరిస్తూ, కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ నేతలది పెత్తందారి తనమన్నారు. టీడీపీలో ఏ మాదిగ కుటుంబానికి భవిష్యత్తు ఉండదని పేర్కొన్నారు. మాదిగలందరూ సంతోషంగా జీవించాలంటే మళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. మహా సేన సలహాదారు మల్లవరపు రవిరాజ, జిల్లా అధ్యక్షుడు కూచిపూడి గోపి, తాడికొండ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సుబ్బారావు, దేవరకొండ రత్న, కావూరి జోషి, కోలా వేళంగినిరాజు, కోలా యిర్మియా, ఆరుమళ్ల మరియదాసు, మాణిక్యరావు పాల్గొన్నారు.

## 20 ముస్లిం కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

**తాడికొండ:** తుళ్ళూరు మండలం బోరుపాలెం, హరిశ్చంద్రపురం గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేనకు చెందిన 20 కుటుంబాల మైనార్టీ నాయకులు సోమవారం వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఈ మేరకు ఆయా పార్టీలకు చెందిన నాయకులకు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. షేక్ నబీసా, షేక్ జాన్ సైదా, పఠాన్ సలామ్, పఠాన్ భాషా, షేక్ శిలారా, షేక్ జాన్ సైదా, షేక్ పెద్ద జాన్ సైదా, అల్లాభక్షు, షేక్ సుభానీ, షేక్ మొయిన్, షేక్ జానీ, షేక్ సుభానీ, షేక్ ఉద్దీన్, షేక్ మహమ్మద్ బషీర్ బేగ్, షేక్ నాగులా, పఠాన్ ఖాజావలి, షేక్ బాజీ, షేక్ కరిముల్లా పలువురు నాయకులు వైఎస్సార్ సీపీ చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ హబీబుల్లా, రాష్ట్ర అధికార ప్రతినిధి దానం వినోద్, వివిధ విభాగాల మైనార్టీ నాయకులు షేక్ బాషా, షేక్ జానీ బాషా, షేక్ సుభానీ, పఠాన్ రెహమాన్, రఫీ, హరిబాబు, జాన్ సైదా గ్రామ పార్టీ అధ్యక్షుడు సహకారి బాబు, వివిధ విభాగాల నాయకులు మెరుగుమాల నాగరాజు, గద్దర్ చెన్నకేశవ మాతంగి పాల్గొన్నారు.

## ముమ్మరంగా ప్రచారం

**మంగళగిరి:** నగర పరిధిలోని ఆత్మకూరులో వైఎస్సార్ సీపీ స్థానిక నాయకుడు బొమ్ము సాంబిరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రచారంలో పార్టీ మంగళగిరి అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. జాలాది నాగేశ్వరరావు, బొమ్ము శ్రీను, చల్లా శ్రీను, రవి, పంతగాని ప్రకాష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## రూ. 7 లక్షల నగదు స్వాధీనం

**గుంటూరు వెస్ట్:** ఎన్నికల వేళ నోట్ల కట్టలు బయటపడుతున్నాయి. సోమవారం పేరేచర్ల వద్ద తనిఖీ బృందం అధికారి స్వాతి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో రూ.7 లక్షలు పట్టుబడింది. అధికారులు నగదుతో పాటు, వాహనంలో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

## ఇద్దరు యువకుల దుర్మరణం

**బైక్ అదుపు తప్పి ప్రమాదం**

**కృష్ణలంక(విజయవాడ తూర్పు):** ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరు యువకులు దుర్మరణం చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం మహానాడు 17వ రోడ్డులో బేగ్ రఫీ(21) భార్య సూఫియాతో కలిసి నివాసం ఉంటున్నాడు. వీరికి ఏడాదిన్నర క్రితం వివాహమైంది. రఫీ ఫంక్షన్లకు పూల డెకరేషన్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం అతడి భార్య సూఫియా అశోక్‌నగర్‌లోని పుట్టింటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో రఫీ తన భార్యను చూడడానికి బావమరిది షేక్ ఇర్ఫాన్(17)తో కలసి ద్విచక్ర వాహనంపై ఆదివారం రాత్రి 11.30 గంటలకు ఇంటి నుంచి వారధి మీదుగా బయలుదేరాడు. నేతాజీ వంతెన దాటి స్క్యూబ్రిడ్జి సమీపానికి వెళ్లగానే రాత్రి 12 గంటల సమయంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరు కింద పడిపోవడంతో డివైడర్‌ను గుద్దుకుని రఫీ అక్కడికక్కడే మృతిచెందగా ఇర్ఫాన్ గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రఫీ మృతదేహాన్ని, గాయాలపాలైన ఇర్ఫాన్‌ను ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇర్ఫాన్ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వైఎస్సార్ సీపీ నేతల ఇంటింటి ప్రచారం



**తాడికొండ:** ఫ్యాను గుర్తుకు ఓటేసి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మేకతోటి సుచరిత, ఎంపీగా కిలారి వెంకట రోశయ్యలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని తుళ్ళూరు మండల వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. సోమవారం తుళ్ళూరు 3వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించిన వారు ఇంటింటికీ సీఎం వైఎస్ జగన్ అందించిన సంక్షేమ పథకాలను వివరించి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి, జిల్లా జేసీఎస్ కన్వీనర్ రమణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నాయుడు నాగేశ్వరరావు, బత్తుల కిషోర్, ఆలోకం సురేష్, డాక్టర్ అశోక్, కంతేటి ఫకీరయ్య, నేలపాటి నాగేంద్ర, ఈదులమూడి దాసు, సిలువేసు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మంగళగిరిలో 'ఆమె'దే పైచేయి

- నియోజకవర్గ ఓటర్లు 2,92,432 మంది
- పురుషులకంటే మహిళా ఓటర్లు 11,099 మంది అధికం

**మంగళగిరి:** నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అభ్యర్థుల విజయాన్ని నిర్దేశించనున్నారు. అధికారిక లెక్కల ప్రకారం మంగళగిరిలో పురుషులకంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. మొత్తం 2,92,432 మంది ఓటర్లు ఉండగా.. అందులో పురుషులు 1,40,660 మంది, మహిళలు 1,51,759 మంది వున్నారు. ఇతరులు 13 మంది ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం 286 పోలింగ్ స్టేషన్లుండగా తాడేపల్లి రూరల్‌లో 41, పట్టణంలో 48, మంగళగిరి పట్టణంలో 62, రూరల్‌లో 77, దుగ్గిరాలలో 58 పోలింగ్ కేంద్రాలున్నాయి. తాడేపల్లి రూరల్‌లో 43,786 మంది ఓటర్లుండగా పట్టణంలో 53,155మంది ఓటర్లున్నారు. మంగళగిరి రూరల్‌లో 77,080మంది ఓటర్లుండగా పట్టణంలో 66,655మంది ఓటర్లున్నారు. దుగ్గిరాలలో 51,756 మంది ఓటర్లున్నారు. నియోజకవర్గంలో మహిళా ఓటర్లు 11,099 మంది అధికంగా ఉన్నారు.

# ఇంటి వద్దకే పింఛన్లు

**తాడేపల్లిరూరల్ :** సామాజిక పింఛన్లను సచివాలయ సిబ్బంది ఇంటివద్దనే అందజేయనున్నారని ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ తెలిపారు. సోమవారం తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యం వలన మంచానికే పరిమితమైన దివ్యాంగులు, డయాలసిస్, తలసేమియా పింఛనుదారులు మొత్తం 3,207 మందికి సచివాలయ సిబ్బంది ద్వారా మే 1న ఇంటివద్దకే పెన్షన్ అందజేయనున్నామని, మిగిలిన 13,256 మంది పెన్షన్ దారులకు వారి ఆధార్ నంబరుకు అనుసంధానం అయిన బ్యాంకు ఖాతాకు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. పింఛనుదారులు సచివాలయం వద్దకు వెళ్లవద్దని, ఒక వేళ పెన్షన్ బ్యాంకు ఖాతాకు జమ కాకపోతే.. సంబంధిత సచివాలయ సిబ్బంది 2, 3 తేదీల్లో ఇంటి వద్దకే వచ్చి పింఛను ఇస్తారని తెలిపారు.

**లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే పింఛను నగదు**

**ఫిరంగిపురం:** మండలంలోని పలు గ్రామాల్లోని పింఛనుదారులకు మే నెల పింఛను నగదు వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ అవుతుందని ఎంపీడీవో విమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 9,445 మంది పింఛనుదారుల ఖాతాలకు రూ.2.80 కోట్లు పింఛను నగదు వేస్తామని చెప్పారు. వారిలో 2,579 మంది పింఛనుదారులకు రూ.74.65లక్షలను లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వచ్చి పింఛను నగదు అందజేస్తామని తెలిపారు.

# 'తాడికొండ' బరిలో 10 మంది అభ్యర్థులు

**గుర్తులు ఖరారు చేసిన ఆర్వో ఎం.గంగరాజు**

**తాడికొండ:** తాడికొండ-86 అసెంబ్లీ స్థానానికి మొత్తం 10 మంది అభ్యర్థులు ఈ పర్యాయం బరిలో నిలిచారు. నామినేషన్ల ఉప సంహరణ ప్రక్రియ పూర్తకాగానే ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.గంగరాజు ఆయా అభ్యర్థులకు పార్టీల గుర్తులు ప్రకటించారు. మొత్తం 16 మంది అభ్యర్థులు నామినేషన్‌లు వేయగా స్క్రూటినీలో సరైన పత్రాలు సమర్పించని కారణంగా నలుగురి నామినేషన్లు తిరస్కరించారు. ఎవరూ నామినేషన్లను ఉపసంహరించుకోలేదని తెలిపారు. ప్రధాన పార్టీలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మేకతోటి సుచరితకు - సీలింగ్ ఫ్యాన్, తెలుగుదేశం పార్టీ నుంచి తెనాలి శ్రావణ్ కుమార్‌కు- సైకిల్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మంచాల సునీల్ కుమార్‌కు- హస్తం, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి శృంగారపాటి బాబురావు- ఏనుగు గుర్తు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గుర్రం రామారావు- బక్కెట్, జై భీమ్ రావు భారత్ పార్టీ అభ్యర్థి జడ శ్రావణ్ కుమార్‌కు కోటు, ఇండియన్ లేబర్ పార్టీ అభ్యర్థి దొడ్డా ముసలయ్య- రొట్టె, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అభ్యర్థి మెండెం మరియదాసు- రబ్బర్ స్టాంప్, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థి తెనాలి రమేష్ బాబు- పెన్ స్టాండ్, స్వతంత్ర్య అభ్యర్థి రావెల ఏసయ్య- బల్ల గుర్తు కేటాయించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు 4 కాగా, గుర్తింపు లేని రాజకీయ పార్టీలు- 5, స్వతంత్ర్య అభ్యర్థిగా-1 బరిలో నిలవనున్నారు. ఇక నామినేషన్లు, ఉప సంహరణ ప్రక్రియ పూర్తి కావడంతో అభ్యర్థులు ప్రచార హోరు పరుగులు పెట్టించనున్నారు.

**మంగళగిరిలో ఎన్నికల బరిలో 40 మంది**

**మంగళగిరి:** మంగళగిరి నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో 40 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి జేసీ రాజకుమారి ఘనియా తెలిపారు. సోమవారం నామినేషన్‌ల ఉప సంహరణ అనంతరం వివరాలను ఆమె వెల్లడించారు. నియోజకవర్గంలో మొత్తం 76 నామినేషన్లు నమోదు కాగా స్క్రూటిని అనంతరం 71 నామినేషన్‌లు అమోదించడం జరిగిందన్నారు. 71 నామినేషన్లుకు గాను 42 మంది అభ్యర్థులను అర్హులుగా నిర్ణయించగా నామినేషన్లు ఉప సంహరణ అనంతరం 40 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. 22 మంది స్వతంత్రులు బరిలో ఉన్నారని, ఎన్నికల సంఘం గుర్తులు కేటాయించని వారికి గుర్తులను కేటాయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నాగేశ్వరావు పాల్గొన్నారు.

# అభివృద్ధికి చేయూతనివ్వాలి

**నూతక్కిలో సజ్జల లక్ష్మి ఎన్నికల ప్రచారం**



మాట్లాడుతున్న సజ్జల లక్ష్మి

**మంగళగిరి:** రాష్ట్రం మరింత అభివృద్ధి చెందేందుకు వైఎస్సార్ సీపీ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి, ప్రజలు చేయూతనివ్వాలని, మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సతీమణి సజ్జల లక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి నగర పరిధిలోని నూతక్కిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహనరావు ఆధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వైఎస్సార్ సీపీ మంగళగిరి అభ్యర్థి మురుగుడు లావణ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూరల్ కన్వీనర్ మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి స్థానిక నాయకులు భీమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, అన్నపురెడ్డి విద్యాసాగర్‌రెడ్డి, భీమిరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి, చీపూడి సురేష్, తమ్మా సుబ్బారెడ్డి, భీమిరెడ్డి సుధాకర్‌రెడ్డి ,నూతక్కి శ్రీను, గర్నెపూడి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# హోం ఓటింగ్‌ను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలి

**తూర్పు ఆర్‌ఓ కీర్తి చేకూరి**



అధికారులతో సమావేశమైన తూర్పు ఆర్‌ఓ కీర్తి చేకూరి

**నెహ్రూ నగర్:** సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 3వ తేదీ నుండి ప్రారంభమయ్యే హోం ఓటింగ్‌ని అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని, హోం ఓటింగ్ సమయంలో పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి పోలింగ్ ఏజెంట్లు కూడా ఉంటారని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో హోం ఓటింగ్, ఈవీఎంల కమిషనింగ్, ఫెసిలిటేషన్ సెంటర్స్ అంశాలపై ఏఆర్‌ఓలతో కలసి సెక్టార్ అధికారులు, హోం ఓటింగ్ బృందాలు, పోస్టల్ బ్యాలెట్ బృందాల సభ్యులకు అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధానంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. హోం ఓటింగ్ సమయంలో పూర్తి స్థాయిలో వీడియోగ్రఫీ రికార్డ్ చేయబడుతుందని వివరించారు. ఓటింగ్ రహస్య బ్యాలెట్ పద్ధతిలో జరగాలని, ఓటు వేసే వారికి ప్రత్యేక కంపార్ట్మెంట్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణకు పోలీసు సిబ్బంది ఉంటారన్నారు. తూర్పులో హోమ్ ఓటింగ్ కోసం ఐదు బృందాలు ఏర్పాటు చేశామమని, ఆయా బృందాలను పర్యవేక్షణకు ఏఆర్‌ఓ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో మైక్రో అబ్జర్వర్ టీంలను కూడా నియమించామన్నారు. క్షేత్ర స్థాయిలో సహకరించని బీఎల్‌ఓల వివరాలు వెంటనే ఏఆర్‌ఓల దృష్టికి తీసుకురావాలని, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏఆర్‌ఓలు సునీల్ కుమార్, భీమరాజు, ప్రదీప్ కుమార్, వెంకటలక్ష్మి, డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com